వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 26 జనవరి, 2024

# మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారం!



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని మరో అత్యున్నత పురస్కారం వరించింది. గణత్రంత దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాల్ని ప్రకటించింది. చిరంజీవిని పద్మ విభూషణ్ పురస్కారం వరించింది. సినీ, రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలకుగానూ 2006లో అప్పటి కేంద్ర ప్రభుత్వం చిరంజీవికి పద్మ భూషణ్ పుర్కస్కారం అందజేసింది. కరోనా, లాక్‌డౌన్ సమయంలో సినీ కార్మికులతోపాటు సామాన్యులకు ఆయన అందించిన సేవలను గురించిన భారత ప్రభుత్వం చిరంజీవిని పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించనుంది. గురువారం రాత్రి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పద్మ అవార్డులను ప్రకటించారు.

## పద్మవిభూషణ్‌పై స్పందించిన చిరంజీవి



కేంద్ర ప్రభుత్వం తనను పద్మవిభూషణ్‌కు ఎంపిక చేసినందుకు చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్(ట్విటర్)లో వీడియో విడుదల చేశారు. "పద్మవిభూషణ్ అవార్డు వచ్చిందని తెలిసిన క్షణం ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో తెలియని పరిస్థితి. మనదేశంలో రెండో అత్యున్నత పౌరపురస్కారం పద్మవిభూషణ్ లభించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక తల్లికడుపున పుట్టకపోయినా, నన్ను తమ సొంతమనిషిగా, మీ అన్నయ్యగా, మీ బిడ్డగా భావించే కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, నా సినీ కుటుంబం అండదండలు, నీడలా నాతో ప్రతినిమిషం నడిచే లక్షలాది మంది అభిమానుల ప్రేమ, ఆదరణ కారణంగానే ఈరోజు నేను ఈ స్థితిలో ఉన్నాను. నాకు దక్కినటువంటి ఈ గౌరవం మీది.

మీరు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు నేను ఏమిచ్చి రుణం తీర్చుకోగలను. నా 45 ఏళ్ల సినీ ప్రస్థానంలో వెండితెరపై వైవిధ్యమైన పాత్రల ద్వారా వినోదం పంచడానికి శక్తిమేరకు ప్రయత్నిస్తూనే ఉన్నాను. నిజజీవితంలో కూడా నా చుట్టూ ఉన్న సమాజంలో అవసరమైనప్పుడు నాకు చేతనైన సాయం చేస్తూనే ఉన్నాను. కానీ నాపై చూపిస్తున్న కొండంత అభిమానానికి ప్రతిగా ఇస్తున్నది గోరంతే. ఈ నిజం నాకు ప్రతిక్షణం గుర్తుకువస్తూనే ఉంటుంది. నన్ను బాధ్యతగా ముందుకు నడిపిస్తుంటుంది. నన్ను ఈ ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక చేసిన భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని చిరంజీవి పేర్కొన్నారు.

# నా జీవితంలో అపురూప క్షణాలివి - త్రిప్తి డిమ్రి



'యానిమల్'లో జోయాగా నటించి ప్రేక్షకులను అలరించారు నటి త్రిప్తి డిమ్రి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రంతో ఆమె ఒక్కసారిగా పాపులర్ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న త్రిప్తి 'యానిమల్' సక్సెస్‌పై ఆనందం వ్యక్తం చేశారు. కెరీర్ విషయంలో ఎప్పుడూ బాధపడలేదన్నారు.

"సినీ పరిశ్రమలో ప్రయాణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎత్తుపల్లాలు సహజం. ప్రతిదాని నుంచి పాఠాలు నేర్చుకోవాలి. 'యానిమల్'తో విశేష ఆదరణ లభించింది. సినిమా సూపర్ హిట్ అవుతుందని ముందే అనుకున్నా. కానీ, నా పాత్రకు ఇంతటి పాపులారిటీ వస్తుందని అస్సలు అనుకోలేదు. ప్రేక్షకులు నాపై చూపించిన ఆదరణకు కృతజ్ఞురాలిని. రోజూ నిద్రపోయే ముందు చిత్రబృందాన్ని గుర్తు చేసుకుని ధన్యవాదాలు చెబుతున్నా. నా జీవితంలో ప్రత్యేకమైన క్షణాలివి. జోయాగా నటించినందుకు అదృష్టంగా భావిస్తున్నా. సంతృప్తిగా అనిపిస్తోంది" అని ఆమె అన్నారు. 'యానిమల్' తర్వాత త్రిప్తికి ఇన్‌స్టాలో ఫాలోవర్స్ సంఖ్య అమాంతం పెరిగింది. తెలుగులోనూ ఆమె అవకాశాలు దక్కించుకుంటున్నారని టాక్. విజయ్ దేవరకొండ - గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్‌లో త్రిప్తి హీరోయిన్‌గా కనిపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇళయరాజా ఇంట విషాదం.. గాయని భవతారణి మృతి



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన కుమార్తె భవతారణి తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె శ్రీలంకలో ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నారని, అక్కడే ప్రాణాలు విడిచినట్లు సమాచారం.

సోదరులు యువన్ శంకర్‌రాజా, కార్తిక్ రాజాలాగే భవతారణి కూడా తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా, సింగర్‌గా తనదైన ముద్ర వేశారు. తెలుగులో ఆమె ఆలపించిన 'నను నీతో నిను నాతో కలిపింది గోదారి' (గుండెల్లో గోదారి) విశేషంగా అలరించింది. 'ఫ్రెండ్స్', 'పా', 'టైమ్', 'ఒరు నాళ్ ఒరు కనవు', 'అనెగన్' తదితర చిత్రాల్లో పలు పాటలు పాడారు. 'ఫిర్ మిలేంగే', 'ఇలక్కనమ్', 'వెల్లాచి', 'అవునా' తదితర సినిమాలకు సంగీత దర్శకురాలిగా వ్యవహరించారు. 'భారతి' చిత్రంలోని 'మయిల్ పోలా పొన్ను ఒన్ను' పాటకుగాను బెస్ట్ ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా జాతీయ అవార్డును ఆమె అందుకున్నారు.

# ఆ విషయంలో విసిగిపోయా




టాలీవుడ్‌లో వరుస ప్రేమకథా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకున్నారు నటి మృణాల్ ఠాకూర్. 'హాయ్ నాన్న' సక్సెస్‌లో భాగంగా బాలీవుడ్‌లో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారామె. హిందీలో రొమాంటిక్ చిత్రాలు ఒకే చేయకపోవడంపై తాజాగా ఆమె స్పందించారు. ఆ జానర్ చిత్రాల్లో నటించాలనే ఆసక్తి తనకీ ఉందన్నారు.


"హిందీలో రొమాంటిక్ చిత్రాల్లో అవకాశాలు నాకు ఎందుకు రావడం లేదో తెలీదు. ప్రేమకథల్లో నటించే అంతటి పాపులారిటీ నాకింకా రాలేదు అనుకుంటా. ఇప్పటివరకూ నాకు ఎన్నో అవకాశాలు వచ్చినా వాటిల్లో రొమాంటిక్ కథలు మాత్రం లేవు. ఆ జానర్ చిత్రాల్లో నటించాలని ఉంది. అలాంటివి నేను కూడా చేయగలనని నిరూపించుకోవడంలో విసిగిపోయా. ఇప్పటికే ఎంతోమందిని అడిగా. ఇకపై అది సహజంగా జరగాలని కోరుకుంటున్నా. బాలీవుడ్‌లో ఎన్నో ఉత్తమమైన ప్రేమకథా చిత్రాలు తెరకెక్కాయి. ఆ జానర్ సినిమాలు చూస్తూ పెరిగా. 'హాయ్ నాన్న', 'సీతారామం' వంటి మనసుని హత్తుకునే ప్రేమకథా చిత్రాల్లో నటించినందుకు సంతోషంగా ఉన్నా. నన్ను క్వీన్ ఆఫ్ రొమాన్స్ అని పిలుస్తున్నారు. అందుకు గర్వపడుతున్నా. ఎందుకంటే.. షారుక్‌ను కింగ్ ఆఫ్ రొమాన్స్ అంటారు కదా" అని ఆమె చెప్పారు.

# 'జై హనుమాన్'లో బాలీవుడ్ స్టార్: ప్రశాంత్ వర్మ



'హను-మాన్' సీక్వెల్ 'జై హనుమాన్'లో ఆంజనేయ స్వామి పాత్రలో ఓ స్టార్ హీరో నటిస్తారని దర్శకుడు ప్రశాంత్ వర్మ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దాని కోసం బాలీవుడ్ నటులను ఎంపిక చేయడానికి ఆడిషన్స్ చేస్తున్నట్లు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ ప్రముఖ హీరో నటించే అవకాశం ఉంది. మేకప్, లుక్ టెస్ట్ చేసి ఎంపిక చేయాలనుకుంటున్నా. పాత్రకు తగిన న్యాయం చేయగలరనే వారినే తీసుకుంటాం. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే వివరాలు ప్రకటిస్తాం. 'జై హనుమాన్'లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నటీనటులు నటించనున్నారు" అని పేర్కొన్నారు. 'హను-మాన్' కంటే తాను రూపొందిస్తున్న మరో చిత్రం 'అధీర' పెద్దదని చెప్పారు. అందులోనూ హనుమంతుడి సీన్స్ ఉంటాయన్నారు.

# ర్యాంప్ వాక్‌లో అనన్య పాండే డ్రెస్



'లైగర్' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన అనన్య పాండేకు ఇక్కడ నిరాశ ఎదురైనా బాలీవుడ్‌లో మాత్రం దూసుకుపోతున్నారు. తాజాగా ఈ బ్యూటీ పారిస్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో వింత డ్రెస్‌తో ర్యాంప్ వాక్ చేశారు. అనన్య ర్యాంప్ వాక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలీవుడ్ యాక్టర్ చంకీ పాండే తెలియని వారుండరు. ఆయన కూతురే అనన్య పాండే. 2019 లో స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2, పతి పత్నీ ఔర్ ఓ సినిమాలతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. 2023లో అనన్య నటించిన 'డ్రీమ్ గర్ల్ 2' కమర్షియల్ హిట్ అయ్యి కోట్లు కొల్లగొట్టింది. అదే సంవత్సరం విడుదలైన 'రాఖీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ'లో ఐటమ్ సాంగ్‌లో మెరిసారు అనన్య. సిద్ధాంత్ చతుర్వేది, ఆదర్శ్ గౌరవ్‌లతో అనన్య నటించిన 'క్యో గయే హమ్ కహా' గతేడాది డిసెంబర్ 26 న సినిమా థియేటర్లలో కాకుండా డైరెక్ట్‌గా నెట్ ఫ్లిక్స్‌లో రిలీజ్ అయ్యింది. తాజాగా అనన్య పారిస్‌లో జరిగిన ఒక ఫ్యాషన్ షోలో విచిత్రమైన డ్రెస్ ధరించి ర్యాంప్ వాక్ చేయడం వైరల్‌గా మారింది. బ్లాక్ కలర్ డ్రెస్‌లో ఇండియన్ డిజైనర్ రాహుల్ మిశ్రాను రిప్రెజెంట్ చేస్తూ బాలీవుడ్ యంగెస్ట్ యాక్ట్రెస్ అనన్య చేసిన ర్యాంప్ వాక్ అదరహో అనిపించింది. ఆమె చేసిన ర్యాంప్ వాక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

